# ధన్వంతరి

డాక్టర్ గిరిగారి ఏకైక పుత్రుడు చనిపొయ్యాడనే వార్త తెలియగానే స్నేహితుణ్ని చూసేందుకు ప్రయాణమయ్యాను. డాక్టరూ, నేనూ కలిసి చదువుకున్నాం. ఆచిన్ననాటి స్నేహంమాట అటుంచి—ఒకప్పుడు నాకు ప్రాణం మీదికివొస్తే తన బుద్ధిబలంతో అతి చాకచక్యంగా నాకు చికిత్సచేసి నన్ను మృత్యుముఖంనుంచి కాపాడాడు. ఆ ప్రాణదాతను నేను జన్మలో మరిచిపోగలనా?

గిరి చాలా విచారకరంగా, విషాదంగా వున్నాడు. ఏడ్పు ఒక్కటి తక్కువగా అతనిలో మిగతా వ్యథనంతట్నీ చూడ గలిగాను. ఐదారు రోజుల్నుంచీ రోగులు పడివున్నారు. దూరదేశాల నుంచి డాక్టర్ ప్రతిభను వినివొచ్చిన రోగులు డాక్టర్ దర్శనంకోసం తహ తహ లాడుతున్నారు. కాని డాక్టర్ అటువైపే వెళ్ళటంలేదట. తను ప్రాక్టీసు మానుకున్నాననీ, ఇంకో డాక్టర్ దగ్గిరికి వెళ్ళమనీ చెప్పాడు. కాంపౌండర్లను కూడా మానుకోమని చెప్పాట్ట, కుమారుడి మరణం అతనికి భరించరానంత దెబ్బ తగిలిందని అర్థంచేసుకున్నాను,

చాలా అలసిపోయి వున్నాడు. అమితంగా విచారించటం వల్ల అతని ముఖంలో అనారోగ్య చిహ్నాలు స్పష్టంగా కనిపిస్తున్నయ్. చాలాసేపు ఓదార్చుతూ మాట్లాడాను.అంతా విని నవ్వాడు. "నేను కొడుకును పోగొట్టు కున్నందుకే

యింతగా విచారించటంలేదు. మృత్యువును ఏ మానవుడు జయించగలిగాడూ? ఎన్నో చావుల్ని, యమబాధల్ని చూశాను. ఆ ఏకపుత్రవియోగంతోనే నేను ఇంతగా కుంగిపోలేదు" అన్నాడు.

"మరి? అన్నాను, ఆశ్చర్యంతో.

కాసేపు బాధగా, బరువుగా ఆలోచిస్తూ ఊరుకున్నాడు.

"శాస్త్రం అనేదాన్ని నమ్మి పదిహేను సంవత్సరాలనుంచి వృత్తిగాచేస్తూ, ఆరాధిస్తున్నాను. అపజయం అనేది వుండొచ్చు; కాని దానికి కారణం తెలుస్తూంటుంది..."

"అంటే?" అన్నాను, అర్థంగాక.

"ఒక జబ్బును ఇంకో జబ్బుగా గుర్తించి, చికిత్స మొదలుపెడతామనుకో, కొంతదూరం పోయ్యాకనన్నా మన పొరపాటు తెలుస్తుంది. చివరకు రోగి చనిపోయ్యాకన్నా ఆ పొరపాటు అర్థమౌతుంది..."

"నిజమే? కాని శాస్త్రవేత్తలు మందులు పొయ్యగలవాళ్ళేకాని—ఆయుస్సును కాదుగా!"

"ఆయుస్సు సంగతి నాకు అక్కర్లేదు. కాని శాస్త్రప్రకారం నాకు పలితాలు కనిపించాలి. రోగి చావు బతుకులకు శాస్త్రం జవాబుదారీ కాకపోవొచ్చు. లోకంలోని

...గాళ్ళు బుర్రలన్నీ కలిసి కనిపెట్టిన శాస్త్ర ఫలితాన్ని చూడ గలుగుతున్నాం. అదే తప్పయిననాడు ఇక శాస్త్రమేమిటి? నా కొడుకు విషయంలో ఇది ఎందుకు తల్లకిందులైందో అమిత గాఢంగా ఆలోచిస్తున్నాను. నాకేమీ అంతుపట్టటం లేదు"

కుర్రాడు యే జబ్బుతో ఎలా మరణించాడో, ఆ వివరాలన్నీ నాకు అర్థం కాక, "కొంచెం వివరంగా చెప్పు" అన్నాను.

"అదో కొత్తరకం జ్వరం. ఉన్నట్టుండి నూటఆరుడిగ్రీల ఉష్ణం వచ్చేస్తుంది. ఎన్ని చేసినా ఉష్ణం తగ్గదు. చివరిదాకా నాడీ, గుండె సరైన స్థితిలోనే వుంటయ్. ఒకవారం రోజుల్లో అటో యిటో తేల్చేస్తుంది. రోగి మాత్రం మగతగా పడివుంటాడు; అప్పుడప్పుడు తెలివికూడా వొస్తూంటుంది. ఇలాటి జ్వరాల్ని గూర్చి చదివాను కాని యెన్నడూ చికిత్స చేసి యెరుగను—"

"కొత్తరకం జబ్బు కావటంవల్ల..."

నామాట పూర్తికాకుండానే డాక్టర్ అన్నాడు:

"సరే...అంతా విను మరి: మావాడిది మొదటి కేస్ కాదు. వీడికి రాక పూర్వం—మూడు రోజులు ముందు నుంచీ ఇంకో కుర్రాడుకూడా ఇదే రకం జ్వరంతో బాధపడుతున్నాడు. వాళ్ళు లక్షాధికార్లు. వాళ్ళకూ ఒక్కడే కొడుకు; మనవాడి

వయస్సే—పదేళ్లు. వాడికి నేనే చికిత్స ప్రారంభించాను. జబ్బును గుర్తించటంలో పొరపాటు పడలేదు. చికిత్స విషయంలో కూడా యేమీ పొరబడలేదు. రాత్రులంతా మేలుకొని అనేక పుస్తకాల్ని చదువుతూ జాగర్తగా అంతా అర్థంచేసుకుంటూ వొచ్చాను. మూడు రోజులకు మా కుర్రాడికూ్కడా అదే జ్వరం ఆరంభమైంది. అతి మెలకువతో, అతి జాగర్తగా చికిత్స మొదలు పెట్టాను. ఐస్ వేసినా, వుడుకులాం వేసినా- ఏం చేసినా సరే ఒక్క డిగ్రీ ఉష్ణంకూడా దిగిరాదు. పోతే యింత ఆహారం ద్రవరూపంలో వెళ్తుంది—అదీ రోగి కాస్త తెలివిగా వున్నప్పుడు; లేకుంటే ఆహారంకూడా ఇంజక్షన్ రూపంలో 'పోవాల్సిందే! ఇలా మొదటి రోగి ఆరు రోజులు గడచినయ్. యేమీ నయం లేదు. రోజు రోజుకూ దిగజారుతున్నాడు. తల్లి దండ్రుల గాభరాచూసి నాకూ కొంచెం అధైర్యం యేర్పడ్డది. వాళ్ళు రెండు వేల రూపాయిల ఫీజుకూడా ఆశపెట్టారు.''

ఆనాడు జరిగిన విషయాన్ని తలుపుకు తెచ్చుకుంటూన్న వాడిలాగు కాస్సేపు తలవాల్చి, మళ్ళీ ప్రారంభించాడు:

''—నాశక్తి కొద్దీ ఆలోచించాను. రోజుకు రెండు మూడుసార్లు రోగిని పరీక్షించేవాణ్ణి. ఇక మా వాడివిషయం —మొదటి రోగికన్న వీడు అన్ని విధాలా నయం. అదీ

కాక-నాకు అనుమానంగావున్న ఫలితాల్ని, మొదటి రోగి మీద ముందు ఎక్స్పరిమెంట్ చేసి, తరువాత మావాడిమీద వుపయోగించుకుంటూ వచ్చాను. ఏదో నాడు—మొదటి రోగి మీద ఆశలన్నీ పోయినయ్, నేను చదివిన చికిత్స ప్రకారం-యింక వొక్కటే దారివుంది. రోగిని పడుకోపెట్టి —ఇరవై ముప్పై బిందెల చన్నీళ్ళను ఒక గంటసేపు చల్లటం. ఈ చికిత్స విషయంలో నా కేమీ నమ్మకం లేదు. చివరకు రోగి తల్లి దండ్రులన్నా ఇందుకు అంగీకరిస్తారో లేదో అనుమానంవేసి అడిగాను. వాళ్ళకు నామీదవున్న గురితోకానీ, కొడుకుమీది ఆదుర్దాతోకానీ—వెంటనే ఒప్పుకున్నారు. ఎక్స్పరిమెంటుకు నిండుప్రాణాన్ని యిచ్చే వాడే దొరకాలి కాని—శాస్త్రకారుడికి దాని విలువతో యేంపనీ? నీళ్ళు చల్లించాను—గంటసేపు. రోగిని తుడిచి పడుకోబెట్టాను. రోగిలో మగత లేదు. శరీరం దాదాపు నార్మల్లోవుంది. చాలా తెలివిగా ఆహారం కావాలని అడిగాడు. నాకు యెక్కడలేని ధైర్యమూవొచ్చింది. అంతే— ఆ మర్నాటినుంచే వాడు మామూలు కుర్రాడయ్యాడు—''

''ఇప్పుడు నీ ఆలోచన దేన్నిగూర్చి?'' అన్నాను.

''అదేజబ్బు; అంతకన్న తక్కువ హానికరంగా వున్నది; అలాటి చికిత్సే చేశాను. మొదటి రోగితో సంపాయించిన

విజ్ఞానాన్నంతట్నీ వుపయోగించు కున్నాను. నా కొడుక్కు నేనెంత గొప్ప చికిత్స చేసివుంటానో ఆలోచించు. మొదటి రోగిలాగే—నీళ్ళు చల్లటం అంతా ఐ ది—తుడిచి పడుకో బెట్టాను. నాడి ఆగిపోయింది. అమృతం అంటూవుండి, దొరుకుతేతప్ప యింక లాభంలేని పరిస్థితి యేర్పడ్డది. రోగం శాస్త్రవిజ్ఞానానికి అతీతమైంది. మొదటిసారే నా కొడుకు మీద నీళ్ళుచల్లాల్సివస్తె నేను ధైర్యం చేసేవాణ్ణి మాత్రం కాదు. అక్కడ వాడు ఎందుకు బతికాడూ? వీడు ఎందుకు చచ్చాడూ? అసలు యీ శాస్త్రానికి ఒక దారి అంటూవుందా అని ఆలోచిస్తున్నాను—"

"ఉండకపోతే యెట్లా?" అన్నాను. "అదే నేనూ ఆలోచించేది. ఇద్దరు రోగులూ చచ్చినా నాకు పేచీలేదు, ఇద్దరూ బతికినా శాస్త్రాన్ని నమ్మేవాణ్ని. ఇప్పుడు ఎటూ కాలేదు..."

"అమలు జరపడంలో పొరపడొచ్చు—"

"పోనీ ఆ పొరపాటన్నా తెలియటంలేదు. అది తెలియక పొయ్యాక—ఇంక యీ శాస్త్రాన్ని నమ్మటం అంత బుద్ధి తక్కువపని యింకోటిలేదు. అంత వరకూ నేను ప్రాక్టీసు చెయ్యను—"

"దానికీ దీనికీ సంబంధం యేమిటీ?"

"లేకపోతే యేమిటీ? శాస్త్రం అంటే యిదేనా? గణిత శాస్త్రంచూడు. నాలుగు నాలుగులు పదహారు. నీకైనా అంతే-నాకైనా అంతే-ఎక్కడైనా, ఎప్పుడైనా ఒక్కటే! ఇదో—అట్లాకాదు. నీకో రకమూ, ఇంకోడికో రకమూనా! ప్రతి మనిషి ప్రాణంమీదా ఒక యెక్స్‌పరిమెంటా? వాళ్ళ జీవాలుమీదనేనా మనవిజ్ఞాన పరామర్శ? వెధవడబ్బు కోసం—యీపాడుపనులు—"

"అట్లా అనవోక, నువ్వుచేసిన ప్రాణదానాలు మాత్రం లేవూ? ఒకసారి నన్నే బతికించావ్—"

"ఆ మాటను కనీసం నాకు నేనే నమ్మలేకుండా వున్నాను. శాస్త్రం తప్పో, రైటో తెలియదు. ఒకే చికిత్సను ఒకేజబ్బుకు చేసేందుకు వీల్లేదు. ఇక మన తెలివితేటలు ఎందుకూ!

"అది నీ వాడి తత్వానికి పడక పోవొచ్చు—"

"మనిషికో తత్వమైతే - మనిషికో శాస్త్రం కూడా కావాలి. అంతేకాని మనుష్యప్రాణాన్ని గూర్చిన ఒకే శాస్త్రం పనికిరాదన్నమాట. మరి అది శాస్త్రమనేందుకే వీల్లేనప్పుడు నేను శాస్త్రకారుణ్ణేకాదు. నేను చేసేమాత్రం యెవ్వరైనా చెయ్యగలరు; అందుకని నేను మాను [illegible]"

నాకు జవాబుదొరకలేదు.

"వాళ్ళ బిడ్డ బతికాడని రెండువేల రూపాయిల ఫీజు పంపారు. నా విజ్ఞానం డబ్బు సంపాయించింది కాని — ప్రాణాన్ని మాత్రం కాదు. మావాడి ప్రాణాన్ని ఎవరు ఇవ్వ గలిగారూ ?"

"ఎవరు ఇవ్వగలరూ? లోకంలో కారణం చెప్పలేనిది ఒక్కటే—మృత్యువు"

"ఆ మృత్యువును జయించే శాస్త్రమంటూ లేదన్న మాట, అందుకని అలాటి శాస్త్రాన్ని ఆరాధించటంలో అర్థంలేదు—"

ఆనాటినుంచీ గిరిప్రాక్టీసు మానుకున్నాడు.

—అక్టోబరు 1945

